మూగజీవాల దాహం తీరేదెలా?

- కుభీర్ మండలంలో దెబ్బతిన్న పశువుల నీటితొట్టిలు
- పోషకులకు తప్పని ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని అధికారులకు వేడుకోలు



కుభీర్‌లోని మహాదేవ్ మందిరం వద్ద దెబ్బతిన్న పశువుల నీటి తొట్టి



రాజూరాలో నిరుపయోగంగా పశువుల నీటితొట్టి

కుభీర్: పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని గ్రామాల్లో నాలుగేళ్ల కిందట నిర్మించిన పశువుల నీటితొట్టిల జాడ కరువైంది. వాటి నిర్వహణ బాధ్యతలను గాలికొదిలేయడంతో కొన్నిచోట్ల నిరుపయోగంగా మారగా.. మరికొన్ని చోట్ల పగుళ్లు తేలి దెబ్బతిన్నాయి. కొన్ని రోడ్డు పక్కన నిర్మించడంతో రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా కూలిపోయాయి. దీంతో వేసవిలో మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించడంతోపాటు అవసరమైన చోట కొత్త నీటి తొట్టిలు నిర్మించాలని పశుపోషకులు కోరుతున్నారు.

వాటర్‌షెడ్డు నిధులతోనూ..

కుభీర్ మండలంలో 41 పంచాయతీలున్నాయి. పంచాయతీకొకటి చొప్పున పశువుల నీటి తొట్టి నిర్మించారు. ఉపాధిహామీ పథకానికి అదనంగా వాటర్‌షెడ్ నిధులతో కుభీర్‌లో రెండు తొట్టిలు, రాజూరాలో ఒక నీటి తొట్టి నిర్మించారు. కుభీర్‌లో వ్యవసాయ మార్కెట్ వద్ద నిర్మించిన పశువుల నీటి తొట్టిని రోడ్డు విస్తరణ పనుల్లో కూల్చివేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించిన తొట్టి సైతం నామరూపాల్లేకుండా పోయింది. మహాదేవ్ మందిరం వద్ద ఈజీఎస్ కింద నిర్మించిన తొట్టి కూలిపోయింది. ప్రస్తుతం వాటి జాడ ఎక్కడా కన్పించడం లేదు. పార్డి(బి)వద్ద నిర్మించిన తొట్టి మాత్రం నీళ్లు లేక నిరుపయోగంగా ఉంది.

అధికారులు పట్టించుకోవాలి..

ప్రస్తుతం వాగులు, నీటికుంటలు ఎండిపోవడంతో పశువులు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి పశువుల నీటి తొట్టిలను నిర్మించి మూగజీవాలకు దాహార్తి తీర్చాలని పశుపోషకులు కోరుతున్నారు.

కష్టంగా ఉంది



నాకు గేదె, ఐదు ఆవులు ఉన్నాయి. వాగుల్లోనూ నీళ్లు లేవు. పశువుల నీటి తొట్టిలు లేక మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. వాటి దాహార్తి తీర్చడం కష్టంగా ఉంది. మేతకు వెళ్లినప్పుడు బయట నీరు దొరకక ఇంటికి తీసుకొచ్చి తాగిస్తున్నాం. పశువుల నీటి తొట్టిలను నిర్మిస్తే మాకు మేలు జరుగుతుంది.

– పిట్ల దత్తాత్రి, కుభీర్

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

నాలుగేళ్ల కిందట మండలంలోని 40 గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో పశువుల తొట్టిలు నిర్మించాం. వాటి నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించాం. నీటి తొట్టిలు లేక పశువులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు వివరిస్తాం. మళ్లీ ప్రభుత్వం నుంచి తొట్టిలు నిర్మించాలని ఆదేశాలు వస్తే మేం నిర్మిస్తాం.

– హరిలాల్, ఈజీఎస్ ఏపీవో, కుభీర్

క్లుప్తంగా

ఆలయానికి విరాళం



సభ్యులకు విరాళం అందిస్తున్న లక్ష్మి

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తొంటుకూరి లక్ష్మి సీతారామాంజనేయ ఆలయానికి రూ.11వేల విరాళం అందజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో నూతన ఆలయ నిర్మాణానికి స్థలం కొనేందుకు విరాళాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, ఖానాపూర్ వీడీసీ అధ్యక్షుడు సతీశ్‌రావుదేశ్‌పాండే, కమిటీ సభ్యులు నాయిని సంతోష్, ప్రశాంత్, ప్రణీత్ ఉన్నారు.

బీఎస్పీకి ఖానాపూర్ ఇన్‌చార్జి రాజీనామా

ఖానాపూర్: బీఎస్పీ ఖానాపూర్ ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ గురువారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పార్టీ మొదట తనను ప్రకటించి.. తర్వాత వేరే వారికి టికెట్ కేటాయించిందన్నారు. తాను మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



మల్లాపూర్‌లో పనులు చేస్తున్న కూలీలు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్, రాచాపూర్, పొట్టపెల్లి, పీచర తదితర గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం మల్లాపూర్, పీచర గ్రామాల్లో చెరువుల నుంచి రైతులు తమ చేన్లలోకి నల్లమట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

ముగిసిన పారాయణం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంరావ్‌బాగ్ కాలనీలో ఈనెల 20న ప్రారంభమైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర పారాయణ కార్యక్రమం గురువారం ముగిసింది. వరంగల్ ప్రాంతానికి చెందిన సోమ నారాయణచారి కళాకారుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. చివరిరోజు జీవసమాధి ఘట్టాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారులను కాలనీవాసులు సన్మానించారు. ఇందులో కాలనీవాసులు, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తానూరు: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని హిప్నెల్లి గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయంలో జరిగిన రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి కబడ్డీ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాల మైదానంలో ఈనెల 27 నుంచి వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పీఈటీ దేవోజీ శ్రీకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ శిబిరానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. రోజు ఉదయం 5:30 నుంచి 8 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రతిష్ఠాపన మహోత్సవం

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ప్రారంభమైంది. గ్రామంలో ఐదు చేతుల పోచమ్మ, నల్లపోచమ్మ, ముత్యాల పోచమ్మ, సారమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపనను చేపట్టనున్నారు. ఈసందర్భంగా పండితులు వెంకటరమణశాస్త్రి, నాగాచారి, పురోహితులు ప్రశాంత్ ఆచారి, బొమ్మెన రాజశేఖర్‌శాస్త్రి, సురేశ్‌శాస్త్రి, వెంకటరమణశాస్త్రి చేతుల మీదుగా హోమం, జలాధివాసం, ధాన్యధివాసం, సయ్యాదివాసం, ప్రతిష్ఠాభిషేకం, తదితర పూజాది కార్యక్రమాలు చేశారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు వీడీసీ నాయకులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన దర్శనం లక్ష్మణ్ (రవి) గురువారం సాయంత్రం కిడ్నీ సమస్యతో మృతి చెందాడు. బుధవారం 2002–03లో అతడితో పదోతరగతి చదివిన స్నేహితులు వైద్యఖర్చుల నిమిత్తం రూ.1,01821 జమ చేసి భార్య స్నేహలతకు అందించారు. లక్ష్మణ్ మృతి బాధాకరమని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

బాల్యవివాహాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

భైంసారూరల్: బాల్యవివాహాలు చేస్తే కలిగే నష్టాలపై మండలంలోని దేగాం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. అమ్మాయిలకు 21ఏళ్లు, అబ్బాయిలకు 24 ఏళ్లు నిండితేనే వివాహాలు జరిపించాలన్నారు. బాల్యవివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భోజన్న, మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు, కిశోరబాలికలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఎనిమిదో వార్డులో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు యూ సుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మడిగెల గంగాధర్, కడార్ల గంగనర్సయ్య, నేరెళ్ల సత్యనారాయణ, శౌకత్‌పాషా, మదిరె సత్యనారాయణ, ముషీర్, అజీజ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: కాంగ్రెస్ అభ్యర్థిని ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఆ పార్టీ మండలాధ్యక్షులు దయానంద్, అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరో వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. వైస్ చైర్మన్ కావలి సంతోశ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్, మండల కార్యదర్శి షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

లోకేశ్వరంలో కార్యకర్తల సమావేశం..

లోకేశ్వరం: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించాలని సూచించారు. బాయమొల్ల భోజన్న, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, సుధీర్‌కుమార్, భోజారెడ్డి, రాములు, నారాయణ్‌రెడ్డి ఉన్నారు.

అంబేద్కర్ చూపిన బాటలో నడవాలి



జౌలా(బి)లో పూలమాల వేస్తున్న నాయకులు

తానూరు: ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని నాయకులు సూచించారు. గురువారం మండలంలోని దౌలతాబాద్, జౌలా(బి) గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటంతో వీధుల్లో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సొసైటీ డైరెక్టర్ గజానంద్, మాజీ సర్పంచ్ బాలాజీ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ యువకుడికి డాక్టరేట్



డాక్టరేట్‌తో మహేందర్

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కీర్తి మల్లయ్య–లక్ష్మి దంపతుల కుమారుడు మహేందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, జూనియర్ కళాశాలల్లో ఇంటర్, నిర్మల్ చాణక్య కళాశాలలో డిగ్రీ..ఉస్మానియా యూనివర్సిటీలో బీఈడీ, పీజీ(పొలిటికల్ సైన్స్) పూర్తి చేశాడు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సంపాదించి ఓబీసీ కమ్యూనిటీపై రాష్ట్ర, జాతీయస్థాయిలో పరిశోధన పత్రాలు సమర్పించి ప్రశంసలు అందుకున్నాడు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్ రెడ్డి పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ సమీకరణ–ఓబీసీల నాయకత్వం' అన్న అంశంపై పరిశోధన చేసి గురువారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు మహేందర్ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



లక్ష్మణచాంద : ర్యాలీలో పాల్గొన్న ప్రత్యూష



మామడలో ర్యాలీ తీస్తున్న సిబ్బంది



కుంటాలలో మాట్లాడుతున్న వైద్యురాలు శృతిరెడ్డి

లక్ష్మణచాంద: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని లక్ష్మణచాంద పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా రహిత సమాజం కోసం ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఇందులో వైద్యసిబ్బంది శేషయ్య, గంగామణి, యాస్మిన్, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మామడ: దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మామడ పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మామడలో దోమలతో కలిగే వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమతెరలు వినియోగిస్తూ.. పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. సీహెచ్‌ఓ లస్మన్న, సిబ్బంది రమణారెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మలేరియా దినోత్సవం పురస్కరించుకుని దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యురాలు శృతిరెడ్డి కుంటాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో కలిగే నష్టాలను వివరించారు. తీవ్రమైన చలిజ్వరం, చెమటలు పట్టడం మలేరియా లక్షణాలని పేర్కొన్నారు. వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'సర్కారు' సత్తా



శిరీష



పుష్పలత



నందిని



అరుణ

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గురుకుల కళాశాల, మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులుఇంటర్ ఫలితాల్లో వందశాతం ఫలితాలను సాధించారు. కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీలో నందిని 465 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో అరుణ 926 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో శిరీష 457, ద్వితీయ సంవత్సరంలో పుష్పలత 954 మార్కులు సాధించినట్లు ఎస్‌వో విమల తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో 34 మంది సీఈసీలో 27 మంది ఉత్తీర్ణత సాధించారు.

నచ్చన్‌ఎల్లాపూర్ గురుకులంలో ప్రథమ సంవత్సరంలో 80 మంది ద్వితీయ సంవత్సరంలో 77 మంది ఉత్తీర్ణత సాధించారు. 981 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన బైపీసీ విద్యార్థిని ప్రవీణను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాధిక అభినందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో 129 మంది పరీక్షలు రాయగా 87 మంది.. ద్వితీయ సంవత్సరంలో 135 మంది పరీక్షలు రాయగా 128 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

పెంబి కేజీబీవీలో వందశాతం ఫలితాలు



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

పెంబి: మండలంలోని మందపల్లి కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో వీణ తెలిపారు. ప్రారంభమైన మొదటి ఏడాదిలోనే కళాశాలలో ఉన్న 12 మంది ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపీసీలో సుస్వర434 మార్కులు, విషిత 427, సౌమ్య 422, ఎం.సౌమ్య 418, ప్రజ్వల 407, రచన 341, బైపీసీలో రాజ్యలక్ష్మీ349, అక్షయ 348, శైలజ 336, అశ్విని305, అక్షిత 300, పవిత్ర 279 మార్కులు సాధించినట్లు ఎస్‌వో పేర్కొన్నారు.

ఖానాపూర్ విద్యార్థుల ప్రతిభ



నరేంద్ర



తజీం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరంలో 222 మంది, ద్వితీయ సంవత్సరంలో 204 మంది విద్యార్థులు ఉండగా.. 88.92 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ హమీద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో మరియా తజీం 425 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పాలిమేర నరేంద్ర 927 మార్కులు, బైపీసీలో హబిబ్ రహమాన్ 886 మార్కులు, వొకేషనల్ విభాగంలో ప్రవీణ్ 409, రజిత 896 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

'భూమి ఇప్పించి న్యాయం చేయాలి'

లోకేశ్వరం: మండలంలోని నర్సింహనగర్ తండాలో జాదవ్ మోతీరాం, జాదవ్ కిషన్ అనే రైతుల పట్టా భూమిలో ఓ నాయకుడు ఎకరంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయించారని.. వెంటనే స దరు రైతులకు తమ భూమిని అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం ఈ విషయమై తన కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తవగానే రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ చెప్పడంతో వెళ్లిపోయారు. దుర్గం నూతన్‌కుమార్, పోశెట్టి, సాయికిరణ్, ముత్తన్న ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరిక



కుంటాల: అంబకంటిలో ట్యాంకు అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్

కుంటాల: పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మండలంలోని అంబకంటి, అంబకంటితండాలో గురువారం పర్యటించారు. అంబకంటిలో పారిశుధ్య నిర్వహణతీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బందిని మందలించారు. గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించగా, పంచాయతీ కార్మికులను జనాభా ప్రతిపాదికన కాకుండా ఎక్కువ మందిని నియమించి జీతాలు ఎలా చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు తేడా ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి ఉత్తంపై చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. గ్రామ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణ లోపంపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎదుట ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉండటంపై మండిపడ్డారు. తాగునీటి ఇబ్బందులతోపాటు వీధి దీపాలు లేవని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు గ్రామంలోని 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత పల్లెప్రకృతి వనం పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీసీ ప్రవీణ్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ ఉన్నారు.

కుభీర్ పాఠశాల పరిశీలన

కుభీర్: కుభీర్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేయిస్తున్న పనులను అదనపు కలెక్టర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ పథకంలో పాఠశాల భవనాలతోపాటు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో గోవర్ధన్, ఈవో విజయ్, ఉపాధిహామీ ఏపీవో హరిలాల్, ప్రధానోపాధ్యాయుడు జె.సాయన్న ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో పొట్టేలు మృతి

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో గురువారం జెడ్ల దేవేందర్‌కు చెందిన గొర్రె పొట్టేలు విద్యుత్‌షాక్‌తో మరణించింది. రోజు మాదిరిగానే ఉదయం గొర్రెలను శివారులోని పొలం వద్ద మేపుతున్నాడు. అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పొట్టేలు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. పొట్టేలు విలువ రూ.22వేలు ఉంటుందని.. విద్యుత్ అధికారులు స్పందించి తనకు నష్ట పరిహారం అందించాలని కోరారు.

పరామర్శ

ముధోల్: మండలంలోని చించాల, పిప్రి, ముద్గల్, న్యూముద్గల్, గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం పరామర్శించారు. అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఖానాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో బుధవారం సాయంత్రం పట్టుకున్నామని ఎఫ్‌ఆర్‌వో వినాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టుకున్న ఇసుక లారీకి తహసీల్దార్ అనుమతి పత్రం ఉండడంతో వారికి అప్పగించామని ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ తాము ఎర్వచింతల్‌లోంచి ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతిస్తే రాంరెడ్డిపల్లె నుంచి తీసుకెళ్లినట్లు కాంట్రాక్టర్ తెలిపాడన్నారు. ఇసుకను తిరిగి అదే ప్రాంతంలో పోస్తామని కాంట్రాక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఓటరు చీటీల పంపిణీ

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు స్లిప్‌ల(చీటీల) పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని 238 పోలింగ్‌బూత్ పరిధిలో ఓటర్లకు గురువారం బీఎల్‌వో వరలక్ష్మి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

కుభీర్: ప్రలోభాలకు లొంగకుండా పోలింగ్‌లో పాల్గొని నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని రంజని గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం పని ప్రదేశంలో కూలీలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు వేయడం కనీస బాధ్యత అని.. ఎన్నికల రోజు సెలవుదినం అని భావించకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శుభ దినంగా భావించాలని సూచించారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో హరిలాల్ తదితరులు ఉన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాల పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద, ధర్మోర, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ మోతీరాం పరిశీలించారు. ధర్మోర గ్రామస్తుల సౌకర్యార్థం పంచగుడి ఉన్నత పాఠశాల నుంచి ధర్మోర ప్రాథమిక పాఠశాలకు.. గడ్‌చాందలో పంచాయతీ నుంచి ఉన్నత పాఠశాలకు.. అబ్దుల్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం నుంచి పంచాయతీ కార్యాలయానికి మార్చామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆర్‌ఐ బాలకిషన్, సర్వేయర్ నరేందర్, అంగన్‌వాడీ టీచర్ విమల, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పోశెట్టి, లింగన్న ఉన్నారు.